# కొనసాగుతున్న ప్రజా పాలన దరఖాస్తులు

## • మేడ్చల్ నియోజకవర్గంలో 31,544 దరఖాస్తులు • మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ పరిశీలన

మేడ్చల్ జోన్ బృందం, డిసెంబర్ 30 : ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం కొనసాగింది. మూడో రోజూ ప్రజలు దరఖాస్తు చేసేందుకు పోటీపడ్డారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు, ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. మేడ్చల్‌లో కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించారు. గుండ్లపోచంపల్లిలో మున్సిపల్ కమిషనర్ రాములు పర్యవేక్షించారు. మండలంలోని నూతన్‌కల్, మైసిరెడ్డిపల్లి, రావల్‌కోల్ గ్రామాల్లో ఎంపీడీవో పద్మావతి, తాసీల్దార్ శైలజ పర్యవేక్షణలో ప్రజాపాలన నిర్వహించారు. ఎంపీపీ రజితారాజమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్ సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో వసంత, సర్పంచ్‌లు కవితా జీవన్, కరుణాకర్, మహేందర్, ఏవో అర్చన పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో ప్రజా పాలన దరఖాస్తులకు విశేష స్పందన లభించింది. శనివారం కార్పొరేషన్‌లోని 8వ డివిజన్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. మొత్తం 5091 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ రామలింగం తెలిపారు. డీఈఈ మాధవాచారి, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్ యాదవ్, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు. కీసర మండల పరిధిలోని కరీంగూడ, యాద్గార్‌పల్లి గ్రామాల్లో ఆరు గ్యారెంటీకు సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది అందజేసిన దరఖాస్తు ఫారాలను ప్రజలు నింపి నేరుగా గ్రామసభల్లో అధికారులకు అందజేశారు. కీసర ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, కరీంగూడ సర్పంచ్ కౌకుట్ల గోపాల్‌రెడ్డి, పుట్ట రాజు, ఎంపీటీసీలు కిరణ్ జ్యోతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తులు |
|---|---|
| మేడ్చల్ | 2138 |
| గుండ్లపోచంపల్లి | 539 |
| తూంకుంట | 1001 |
| నాగారం | 1816 |
| దమ్మాయిగూడ | 2003 |
| ఘట్‌కేసర్ | 1259 |
| పోచారం | 1189 |
| జవహర్‌నగర్ | 4812 |
| పీర్జాదిగూడ | 4623 |
| బోడుప్పల్ | 3952 |
| **మండలం** | **దరఖాస్తులు** |
| మేడ్చల్ | 3071 |
| శామీర్‌పేట | 1083 |
| మూడుచింతపల్లి | 1044 |
| ఘట్‌కేసర్ | 2030 |
| కీసర | 1284 |
| **మొత్తం** | **31,544** |



ఘట్‌కేసర్ 3వ వార్డులో మహిళ నుంచి దరఖాస్తు తీసుకుంటున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



జవహర్‌నగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

### పరిశీలించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో శనివారం అధికారులు ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ 3వ వార్డు కేంద్రాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. ప్రజల నుంచి దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. అదేవిధంగా ఘట్‌కేసర్ మండలంలోని అంకుషాపూర్, కొర్రెముల గ్రామాల్లో శనివారం జరిగిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్‌గౌడ్, సర్పంచ్ జలజాసత్యనారాయణరెడ్డి, కార్యదర్శి కవిత, అధికారులు పాల్గొన్నారు.

### బోడుప్పల్‌లో దరఖాస్తుల కొరత

బోడుప్పల్ నగర పరిధిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు అధికారులు 33 కౌంటర్లను ఏర్పాటు చేశారు. శనివారం పలు కౌంటర్ల వద్ద దరఖాస్తు ఫారాలు లభించక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులతో మాట్లాడి దరఖాస్తుల కొరత సమస్యను పరిష్కరించినట్లు మేయర్ బుచ్చిరెడ్డి తెలిపారు.

### పీర్జాదిగూడలో...

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం మూడో రోజు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26 డివిజన్లలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పలు కేంద్రాలను మేయర్ జక్క వెంకట్‌రెడ్డి సందర్శించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అధికారులు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మేడ్చల్, డిసెంబర్ 30 : కళాశాలలో విద్యాబుద్ధులు నేర్చుకోవడంతో పాటు సామాజిక బాధ్యతలను అలవరచుకోవాలని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్(అటానమస్) కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ప్రస్తుత విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. కళాశాల డీన్, హెచ్‌ఓడీ, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


## సీఎంఆర్‌లో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. సీఎంఆర్ కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి, సీఈవో అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ సాహుల్, పీఆర్‌ఓ దుర్గా ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. – మేడ్చల్, డిసెంబర్ 30

## పోచారంలో అయోధ్య అక్షింతల ఊరేగింపు

ఘట్‌కేసర్, డిసెంబర్ 30 : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను శనివారం పోచారంలో ఊరేగించారు. సంస్కృతి టౌన్‌షిప్ శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పోచారంలోని స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయం వరకు భజనలు, సంకీర్తనలతో భక్తులు, ప్రజాప్రతినిధులు ఊరేగింపు నిర్వహించారు. సం స్కృతి టౌన్‌షిప్ అధ్యక్షుడు, 12వ వార్డు కౌన్సిలర్ హరిప్రసాద్‌రావు, బీజేపీ నాయకుడు కే. రామోజీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

## వేంకటేశ్వర స్వామి ఆలయంలో పల్లకీ సేవ

ఘట్‌కేసర్, డిసెంబర్ 30 : పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకీ సేవ, అన్నదానం నిర్వహించారు.ఈఓ భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ పి.రాజేశ్‌గౌడ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సైన్స్‌ఫెయిర్‌తో విజ్ఞానం



విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి

పీర్జాదిగూడ, డిసెంబర్30: విద్యాలయాల్లో సైన్స్‌ఫెయిర్ నిర్వహించడం ద్వారా విద్యార్థులకు సృజనశక్తితో పాటు విజ్ఞానం పెరుగుతుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మేడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జన్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌ను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టుల నమూనాలను పరిశీలించి అభినందించారు. కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సత్యప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు మిలన్, రామ్,రఘు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 30 : న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థిని ఎంపికైంది. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఎం ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్న టి అఖిల విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన వెస్ట్‌జోన్ ప్రీ రిపబ్లిక్ క్యాంప్‌లో పాల్గొని ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైంది. అఖిలను ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సి మల్లేశ్, డీన్ వసుధాబక్షి, నవీన్, బాబాశంకర్‌రావు అభినందించారు.

## 'సఖీ' తోడ్పాటుపై విద్యార్థినులకు అవగాహన

మేడ్చల్, డిసెంబరు 30 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సఖీ కేంద్రంలో బాధిత మహిళలకు తోడ్పాటునందిస్తున్నట్టు మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి సలోమీ తెలిపారు. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థినులకు సఖీ కేంద్రం ద్వారా బాధితులకు అందిస్తున్న తోడ్పాటును వివరించారు. బాలికలు,మహిళలపై ఎలాంటి అకృత్యాలకు పాల్పడినా వెంటనే 1098కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కమలాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దేవరాజ్, గణేశ్, సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

శామీర్‌పేట, డిసెంబర్ 30: తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతిలో మండల, పాఠశాల స్థాయిల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 12వ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బెజగం ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు పురస్కారాలు అందజేయడం శుభపరిణామన్నారు. బెజగం ఆగయ్య, గౌరమ్మ జ్ఞాపకార్థం మండల స్థాయిలో ప్రథమ బహుమంతి సాధించిన సత్యమనోహర్(తె.మీ.), బబిత(ఇం.మీ) విద్యార్థులకు ఆయన ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అదేవిధంగా ద్వితీయ స్థానంలో నిలిచిన వైష్ణవి, అక్షిత, తృతీయ స్థానంలో నిలిచిన వాణి, కీర్తనలకు పురస్కారాలు అందించారు. 10వ తరగతిలో పాఠశాల టాపర్స్‌తో పాటు 6వ, 7వ, 8వ, 9వ తరగతిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. 1968–69 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొని టాపర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలేశ్, చింతల శ్రీనివాస్‌రెడ్డి, బర్రెంకబావి రవీందర్‌రెడ్డి, డాక్టర్ సింగం రామారావు, సముద్రాల లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దేవరయాంజాల్ జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు